


పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# సినిమా కథలు

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు.

## తెలుగు సినిమా, జనవరి, 1948



**యంత్ర యుగానికి చెందినవైనందుకు** సినిమా కథలకూ, పారిశ్రామిక వస్తువులకూ కొంత పోలిక వుండటం గమనించదగ్గ విషయం. అవి కడపటి కొనుగోలుదారుకు – వాడుకునేవాడికి – చౌకగా అందుతాయి. వాటిలో కొన్ని నమూనా లక్షణాలు వుంటాయి అంటే కొన్ని కొన్ని ఒక పంపిణీమీద తయారవుతూ వుంటాయి. వీటి నిర్మాణంలో అమ్మకానికి కావలసిన ఆకర్షణ వున్నంతగా "గట్టి" ఉండదు. ఇవి "మంది" కోసం తయారవుతాయి. కొన్నవాడికి "ఇది నా ఉపయోగార్థమే సృష్టించారు" అనే భ్రమ కలగదు.

పైన చెప్పిన లక్షణాలలో చివరవి రెండూ తీసుకుందాం. అభ్యుదయ రచయితల దృష్టిలో కళ సర్వజనోపయుక్తంగా వుండటం తప్పుకాదు. కాని అభ్యుదయ కళను ఆస్వాదించేవాడికి "ఇది నా కోసమే సృష్టించారు" అనే భావం కలగకపోవటం చాలా తప్పు. ఈ ముఖ్య విషయం గమనించనివారు అభ్యుదయ సాహిత్యాన్ని చౌకబారు సాహిత్యంతో సమం చేసి చూస్తూనే వున్నారు. అభ్యుదయ సాహిత్యం వ్యక్తి విశిష్టతను నాశనం చేస్తుందని కూడా వాదిస్తున్నారు. అభ్యుదయ సాహిత్యం వ్యక్తి యొక్క

విశిష్టతను గుర్తించగలదని "ముందడుగు", "మా భూమి" నాటకాలు రుజువుచేశాయి. అవి చూసినవాళ్ళెవరూ, "ఇది నాకోసం రాసింది కాదు" అనుకోనవసరం లేదు – ప్రజా సామాన్యం మాట చెబుతున్నాను.

సినిమా కథల సంగతి మాట్లాడుకుంటున్నాం. వీటిలో సామాన్యంగా వుంటూన్న లోపాలు చూస్తే అవి ప్రమాదవశం చేత కలుగుతున్నవి కావనీ, వాటి వెనక వ్యక్తంగానో, అవ్యక్తంగానో ఒక మనస్తత్వం వుందనీ, ఆ మనస్తత్వానికి లాభాలతో సంబంధం వుందనీ, అది ప్రజా శ్రేయస్సుకు తోడ్పడదనీ సులభంగా తెలుసుకోవచ్చు.

1. ప్రజా సామాన్యంలో వుండే మూఢ విశ్వాసాలను బలపరచటం పద్దవాళ్ళు చెడ్డవాళ్ళు కారు. నమ్మిన వాళ్ళు చెడిపోరు, తిరుగుబాటులో సౌజన్యం లేదు. ఆడదయేది, మగవాడయేది కష్టాలకు తల ఒగ్గితే చివరకు బాగుపడతారు. మంచి ఆడది పతి సేవ చేస్తుంది. భర్త ఫోటోలకి దండలు వేస్తుంది. భర్త పాదాలు కడిగి నెత్తిన చల్లుకుంటుంది. మొగుడు చెడు తిరుగుళ్ళు తిరిగితే కంట నీరు పెట్టి భరిస్తుంది. అటువంటి ఆడదాని కష్టాలు గట్టెక్కి తీరతాయి. చదువుకున్న ఆడవాళ్ళు మంచివాళ్ళు కారు, ఇత్యాది.

ఇట్లా ప్రజల మూఢవిశ్వాసాలను బలపరచటం వల్ల ఆర్థికంగా చిత్ర నిర్మాతలకి లాభం వుంది. ఎవరి మూఢవిశ్వాసాలను వారు ఏవగించుకోరు. ఆ మూఢ విశ్వాసాలను విమర్శించటం వల్ల కొందరికైనా కోపం రావచ్చు. అదీకాక మూఢ విశ్వాసాలకు సనాతన విజ్ఞానానికుండే గౌరవం వుంటుంది. వాటిని బలపరచటం వల్ల ప్రజలలో చిత్రాలకు కొంత గౌరవం కూడా కలగవచ్చు. ఈ విధంగా ప్రజల మూఢవిశ్వాసాలను బలపరచటం వల్ల వారిలో చైతన్యం ఎట్లా కలుగుతుంది? వారిలో అభ్యుదయకరమైన మార్పు ఎట్లా వస్తుంది? ఈ విషయాలు చిత్ర నిర్మాతలను బాధించవు.

2. వ్యక్తిని సంఘం నుంచి వేరు చెయ్యటం – మంచివాళ్ళని భగవంతుడు కనిపెట్టి వుంటాడు, కష్ట సమయంలో భగవంతుణ్ణి తలుచుకుని నమ్ముకున్నవాడికి సుఖం కలిగి తీరుతుంది. సంఘం నీచమైనది, అది ఆపదలో వున్నవాణ్ణి ఎన్నటికీ ఆదుకోదు, పై పెచ్చు రాళ్ళు రువ్వుతుంది.

భగవంతుడు గారడీ చేసి అయినా సరే సంఘం చెయ్యలేని ఉపకారం చేస్తాడు.

జీవితాన్ని ఇట్లా చిత్రించటంవల్ల అనేక చిత్రాలలో కథా శిల్పం కూడా దెబ్బతిని సన్నివేశాలలో రస లోపం కూడా జరుగుతుంది. ముఖ్యపాత్రలకు కష్టాలు భగవంతుడి పరీక్షగా రావటం వల్ల ప్రేక్షకుడికి వాటిని గురించి మరో విధమైన భావం కలుగుతుంది. భగవంతుడు వెంట వుండటం మూలాన కష్టాలు తొలగటంలో వింత ఏమీ వుండదు. ఇందువల్ల రసం చెడుతుంది. అయినా నిర్మాతలు ఇటువంటి విధానం మార్చుకోరు. ఎందుకంటే ఇట్లా చెయ్యని పక్షంలో యదార్థ జీవితానికి దగ్గరగా రావలిసి వస్తుంది. వ్యక్తుల కష్టాలకు మూల కారణమైన శక్తులను బయటపెట్ట వలసి వస్తుంది. అట్లా బయట పెట్టటం వల్ల "విప్లవం" జరగటానికి తోడ్పడటం జరగవచ్చు. అది కొన్ని వర్గాలకు రుచించకపోవచ్చు.

3. అభ్యుదయ నినాదాలు అరువు పుచ్చుకుని దుర్వినియోగపరచటం "ప్రజాస్వామ్యం", "అభ్యుదయం", "రాజు ప్రజాభిప్రాయాన్ని పాటించాలి", "సంఘంలో అందరికీ సమాన హక్కులుండాలి", "ప్రతివాడూ దేశం కోసం ఆత్మార్పణం చేసుకోవాలి", "దేశం అవిభాజ్యం" ఇత్యాది.

సామాన్యంగా ఈ నినాదాలు శుష్కప్రియాలుగానే వుంటాయి. వాటి వెనక సాంఘిక సత్యం ఏమీ చిత్రంలో వుండదు. అయితే ఈ నినాదాలెందుకంటే వీటికి "గల్లాపెట్టె" మహత్యం వుంది. అవి జీవితంలో ప్రజలను బలంగా ఆకర్షిస్తున్నప్పుడు చిత్రం కూడా ఆకర్షించవచ్చు. చిత్రం అభ్యుదయకరమైనదని కొందరు నమ్మవచ్చు.

ఈ లక్షణాలతో బాధపడుతున్న సినిమా కథ ఉత్తమజాతి సాహిత్యం కాకుండా పోవటమేకాక అభ్యుదయ పంథాకు విద్రోహకారిగా కూడా వుంటున్నది. ఈ లక్షణాలు పోవాలంటే కేవలమూ చిత్ర నిర్మాతల దృష్టి మాత్రమే మారితే చాలుననుకోవటం పొరపాటు. ప్రేక్షకులు కూడా కొంత విజ్ఞానం పొందినప్పుడే వీటికి మోక్షం వుంది. ప్రజల దృష్టి పథంలో మార్పు కలగాలంటే అనేక  పత్రికలు కొంతకాలం పాటు అభ్యుదయ దృష్టితో సినిమా చిత్రాలను విమర్శించి ప్రజలలో చైతన్యం పట్టుకు రావాలి. ఇది అసాధ్యం మట్టుకు కాదు. సామెత చెప్పినట్టు చీమలు పాకితే రాళ్ళరుగుతాయి.

Post your comments